


చిన్నారుల రక్షణ అందరి బాధ్యత : లక్ష్మిశారద

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 23 ఆగస్టు , 2026 | పేజీలు :7

# గూడు లేని బతుకులు

## ఇందిరమ్మ ఇంటి కోసం జంగాల కాలనీ ఎదురుచూపులు

## గుడిసెల్లోనే జీవనం.. 40 ఏళ్లుగా బతుకులు.. వర్షం,ఎండకు తప్పని తిప్పలు

## అర్హత ఉన్నా ఇళ్లు మంజూరు కాలేదని జంగాల కాలనీవాసుల ఆవేదన

**ప్రజాపక్షం/మునుగోడు:** మాకు సొంత ఇల్లు లేదు..పూరి గుడిసెల్లోనే బతుకుతున్నాం.. అయినా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదు అంటూ మునుగోడు మండల కేంద్రం లోని లక్ష్మీదేవిగూడెం జంగాల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దశాబ్దాలుగా గుడిసెల్లో జీవిస్తూ పాత ఇనుప సామాన్లు, ప్లాస్టిక్ సీసాలు సేకరించి జీవనం సాగి స్తున్న తమను అధికారులు పట్టించుకోవడం లేదని వాపో తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది.గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హులను గుర్తించి విడతల వారీగా ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తోంది.అయితే మండల కేంద్రంలోని జంగాల కాలనీలో మాత్రం పరిస్థితి భిన్నంగాఉందని కాల నీవాసులు చెబుతున్నారు.



**నాలుగు దశాబ్దాలుగా గుడిసెల్లోనే**

లక్ష్మీదేవిగూడెంలోని జంగాల కాలనీలో సుమారు 100 నుంచి 120 కుటుంబాలు 40 నుంచి 50 ఏళ్లుగా గుడిసె ల్లోనే జీవనం సాగిస్తున్నాయి. పాత ఇనుప సామాన్లు, ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించి వాటిని విక్రయించడం ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్నారు.వర్షం కురిసినా, ఎండలు మండినా గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేవలం పది ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయని కాలనీ వాసులు తెలిపారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తమ కాలనీలోని కుటుంబాలంతా దరఖాస్తు చేసుకున్నప్పటికీ మొదటి విడ తలో ఒక్కరికీ ఇల్లు మంజూరు కాలేదని వాపోయారు.

మా గుడిసెలు చూస్తే మా పరిస్థితి అర్థమవుతుంది

తమకు సొంతంగా భూములు,ప్లాట్లు లేవని,ప్రభుత్వం నిర్దే శించిన అర్హతలు ఉన్నప్పటికీ ఇళ్లు మంజూరు కావడం లేదని కాలనీవాసులు పేర్కొన్నారు. అధికారులు తమ కాల నీని స్వయంగా సందర్శించి గుడిసెల్లో జీవిస్తున్న కుటుం బాల పరిస్థితిని పరిశీలించాలని కోరుతున్నారు. కనీసం రెండో విడతలోనైనా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంది రమ్మ ఇల్లు మంజూరు చేసి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**దినదినగండంగా బతుకుతున్నాం:పురాణపు నాగమ్మ**



40 ఏళ్లుగా స్థలం కొనుక్కొని గుడిసె వేసుకుని పాత ఇనుప సామాన్లు ఏరుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. చిన్న గుడిసెలో పిల్లలతో కలిసి వర్షానికి, ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం వెంటనే తమ గుడిసెలను పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

**ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదు: కొండపల్లి శంకర్**



తమ గూడెంలో వంద నుంచి 120 కుటుంబాలు పూరిగుడిసెల్లో జీవిస్తున్నాయని తెలిపారు. గతంలో పది ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయని, ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంది రమ్మ ఇళ్ల పథకంలో తమ కాల నీలో ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని అన్నారు.అధికారులు కాలనీని సందర్శించి అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంది రమ్మ ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**అర్హులను గుర్తించి రెండో విడతలో మంజూరు చేస్తాం: పంచాయితి కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి**



జంగాల కాలనీవాసులు ఇంది రమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకు న్నారని తెలిపారు. వారు సర్వే నంబర్ 78లోని ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్నారని చెప్పారు.కొందరికి టాక్సీ ప్లేట్ వాహనాలు ఉండటంతో ఇళ్లు మంజూరు కాలేదని, మొదటి విడ తలో రెండు కుటుంబాలకు ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.రెండో విడతలో అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# రియాక్టర్ పేలి భారీ విధ్వంసం

హెజెలో ఫార్మా కంపెనీ తాత్కాలికంగా సీజ్


ముగ్గురు దుర్మరణం,ఒకరి పరిస్థితి విషమం,8మందికి తీవ్ర గాయాలు

మృతుని కుటుంబానికి రూ.2.80 కోట్ల పరిహారం

గాయపడ్డ వారికి మెరుగైన చికిత్సకు పూర్తి బాధ్యత

కంపెనీ తెరిచే వరకు కార్మికులకు వేతనాలు చెల్లింపు

బాధితులకు అండగా ఉంటామని అదనపు కలెక్టర్ భాస్కరరావు వెల్లడి




# డంపింగ్ యార్డ్‌లో పశువుల కొట్టం

## రక్షణ కరువై గ్రామస్తుల ఆందోళన



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలం లోని స్వాములవారి లింగోటం గ్రామంలో చెత్త సేకరణ,శుద్ధి కోసం ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ ప్రస్తుతం నిర్వహణ లోపంతో తీవ్ర గందరగోళంగా మారింది.ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా నిర్మించిన ఈ యార్డ్ రక్షణ కరువై పశువుల కొట్టంగా రూపాంతరం చెందింది. గ్రామం నుంచి సేకరించిన చెత్తను శుద్ధి చేయాల్సిన ప్రాంగణంలో పశువులను కట్టేస్తుండటంతో దుర్గంధం తీవ్రమై, పరిసరాలు అప రిశుభ్రంగా తయారయ్యాయి.అంతేకాకుండా డంపింగ్ యార్డ్ చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలు, ఫెన్సింగ్‌ను ఆకతాయిలు, దొంగలు ఎత్తుకెళ్లడంతో ప్రాంగణానికి రక్షణ లేకుండా పోయింది. ప్రజాధనం వృథా కావడమే కాకుండా అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల గ్రామంలో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని స్వాములవారి లింగోటం గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించి ఫెన్సింగ్ పున రుద్ధరించి, డంపింగ్ యార్డ్‌ను పూర్వస్థితికి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధి కారులను, ప్రజాప్రతినిధులను గ్రామస్తులు కోరుతున్నారు.

## కొనసాగుతున్న పవిత్రోత్సవములు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పవిత్రోత్సవములలో భాగంగా రెండవ రోజైన శనివారం యాగశాలలో హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో యజ్ఞాచార్యులు హరిచరణ్ ఆచార్యులు, అనిల్ కుమార్ స్వామివారికి పట్టు పవిత్ర మాలలు అలంకరించి ఆరాధనలు కొనసాగించారు. మధ్యాహ్నం నిత్య పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యనిర్వహణాధికారి అభివృద్ధి కమిటి సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విఓఏల నూతన కమిటీ ఏకగ్రీవం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల విఓఏల నూతన కమిటిని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటి గౌరవాధ్యక్షుడిగా దూత శ్రీనివాస్, అధ్యక్షురాలిగా పగడాల జయమ్మ, ఉపాధ్యక్షురాలిగా నారాయణ పద్మ, కార్యదర్శిగా రాయిరాల జానయ్య, సంయుక్త కార్యదర్శిగా కొండేటి విజయ, కోశాధికారిగా మామిడి నిర్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు జయమ్మ మాట్లాడుతూ విఓఏల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. విఓఏలకు అవసరం లేని పనిభారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తానని, విధుల్లో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల విఓఏలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో తీజ్ పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి వాంకుడోతు సేవ్య విజయ ఆధ్వర్యంలో తీజ్ పండుగ ఐదవ రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీజ్ పండుగ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకల్లో పాల్గొంటూ సంప్రదాయాలను కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పిచ్చమ్మ, సైది, నీలమ్మ, కవిత, ధ్వలి, సుశీల, లక్ష్మి పాల్గొన్నారు.

## రూపారెడ్డికి నివాళి

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని సిరిపురం గ్రామం ప్రాథమిక పాఠశాల2లో శనివారం నల్లబ్యాడ్జిలతో విద్యార్థుల చేతిలో హత్య చేయబడిన ప్రిన్సిపాల్ రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఉపాధ్యాయులు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుజాత, జ్యోతి, అనూష; పాఠశాల సిబ్బంది రసూల్, మణెమ్మ, చందన పాల్గొన్నారు.



## న్యాయహక్కులపై విద్యార్థులకు అవగాహన




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవా కమిటి ఆధ్వర్యంలో శనివారం నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నీరజ అధ్యక్షతన న్యాయ హక్కులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజూర్‌నగర్ సబ్‌కోర్టు సివిల్ న్యాయమూర్తి ఎన్.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, తమ హక్కులను తెలుసుకుని బాధ్యతయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. న్యాయసేవలు, ప్రాథమిక హక్కులు, బాధ్యతలు, ఉచిత న్యాయ సహాయం, బాలల హక్కుల తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ రమణారెడ్డి, ఎస్ఐ గోపాల్‌రెడ్డి, లీగల్ ఎయిడ్ అడ్వకేట్ కాల్వ శ్రీనివాసులు, ఆఫీసర్ వనపర్తి శ్రీనివాసులు, స్టూడెంట్ కౌన్సిలర్ ఎం.గణేష్, అధ్యాపకులు సైదులు, ప్రణతి, వెంకన్న, సునిత, నరేందర్, ప్రసాద్, అంజయ్య, నర్సింహాచారి, వీరు, వెన్నెల పాల్గొనారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి పాడిగేదె మృతి



**ప్రజాపక్షం/అనంతగిరి:** మేతకు వెళ్లిన పాడిగేదె ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రంగయ్యగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. రంగయ్యగూడెం గ్రామానికి చెందిన పప్పుల సీతరామయ్యకు చెందిన పాడిగేదె శనివారం అమీనాబాద్ పొలాల వద్ద మేతకు వెళ్లింది. పొలాల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లినసమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై మృతిచెందింది. దీని విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని, ఈ గేదెను ఈ మధ్యనే కొనుగోలు చేసినట్లు బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రభుత్వం తమను అదుకోవాలని కోరారు. పాడి పరిశ్రమనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు తీరని నష్టం జరిగిందన్నారు.

## సబ్సిడీపై విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/మునగాల:** మండలంలోని రైతులు ఆరుతడి పంటలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో వ్యవసాయశాఖ కంది, మినుముల విత్తనాలను సబ్సీడీపై కేటాయించిన కంది, మినుముల విత్తనాలను ప్రభుత్వం అందజేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జడ్పి సిఈవో కె.మహాలక్ష్మి అన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల సాధ్యమైనంత వరకు వరి పంటను తగ్గించుకుని ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని కోరారు. ఖాళీగా ఉన్న పొలాల్లో తప్పనిసరిగా ఏదో ఒక ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా మునగాల వ్యవసాయశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, విత్తనాలు వచ్చిన తర్వాత మొదటగా సీరయల్ ప్రకారం రైతులకు విత్తనాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమేష్‌దీన్‌దయాల్, మండల వ్యవసాయశాఖ అధికారి బుంగరాజు, డిప్యూటి తహసిల్దార్ సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారులు నాగు, సునిత, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలి



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో వర్షాలు సకాలంలో కురవక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి లక్పతి నాయక్ సూచించారు. శనివారం దేవరచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో సాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయని ఏవో తెలిపారు. బోరుబావులు ఉన్న రైతులు సైతం నీటి కొరత కారణంగా పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగుతో నష్టపోయే అవకాశం ఉందని రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు ఏఈఓ సర్దార్, రైతులు పాల్గొన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, పంటల సాగు, నీటి లభ్యత తదితర అంశాలపై చర్చించారు.

## చిరంజీవి స్ఫూర్తితో సేవా దృక్పదాన్ని అలవర్చుకోవాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మెగస్టార్ చిరంజీవి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవా దృక్పదాన్ని అలవర్చుకోవాలని చిరంజీవి సేవా సమితి మండల అధ్యక్షులు కొండా సైదులుగౌడ్, గౌరవ అధ్యక్షులు తోడేటి వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని అబ్బిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో చిరంజీవి అభిమాన సంఘం ఉపాధ్యక్షులు గొలి హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు ఇతర విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. సర్పంచ్ ఎడవల్లి కమలమ్మ, ఉపేందర్‌రెడ్డి, హుస్సేన్, దవాజీ, కిషోర్, రాము, సైదులు, జానిపాషా, నవీన్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, దస్తగిరి, రెడ్డి పాల్గొన్నారు.



## భవిష్యత్తు ఎలక్ట్రిక్ బైకులదే

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బైకుల వినియోగం మరింత పెరగనుందని ఎంజీవన్ భూమి ఎలక్ట్రికల్ బైక్ కంపెనీ వ్యవస్థాపకులు రంగారెడ్డి మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ బాంకెట్ హాల్లో సిఅండ్ఎఫ్ సూర్యాపేట డీలర్ బూర మల్సూర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలు, కాలుష్య సమస్యలకు ఎలక్ట్రిక్ వాహనాలు మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బైకుల వినియోగంతో ఇంధన ఖర్చులు తగ్గడంతోపాటు పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన పెంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాటిని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, జనార్థన్, సతీష్ పాల్గొన్నారు.

## హంక్య తండాకు బోర్డు ఏర్పాటు




**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని కేశ్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో హైదరాబాద్‌నాగార్జున సాగర్ హైవేపై ఉన్న హంక్య తండాకు వెళ్ళుటకు సూచిక బోర్డు లేక ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను హంక్య తండా వార్డు సభ్యులు వినోద్ సర్పంచ్ రమావత్ రాజునాయక్ దృష్టికి తీసుకువెళ్ళారు. స్పందించినటువంటి సర్పంచ్ రాజు నాయక్ శనివారం తండా గేటు వద్ద హంక్య తండా సూచిక బోర్డును ఏర్పాటు చేయించారు. ఈకార్యక్రమంలో కేశ్య తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి సరస్వతి, ఉప సర్పంచ్ పద్మ భీమ్లానాయక్, వార్డు సభ్యులు జగన్‌నాయక్, విజయ, సంధ్య, దేవు, బాణ్యానాయక్, రంగ, లక్‌పతి తండా ప్రజలు పాల్గొన్నారు.

## తారురోడ్డు మట్టి రోడ్డుగా మారిన దృశ్యం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని వేణుగోపాలపురం నుండి వీరాంజనేయ నగర్ వెళ్లే తారురోడ్డు మట్టిరోడ్డుగా కనిపిస్తున్న సంఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ భూములు పైకి ఉండటంతో తారురోడ్డు కిందికి ఉండటంతో పంట పొలాల్లో నీరు, వర్షకాలంలో వర్షపునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటం వల్ల రోడ్డుపై పొర కొట్టుకపోయి మట్టిరోడ్డుగా మారిందని వాహనదారులు తెలిపారు. వర్షకాలం కావడంతో వర్షాలకు రోడ్డు బురదమయంగా మారిందని రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులకు ఈరోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా ఉందని అన్నారు. నడిగూడెం నుండి నారాయణపురం రహదారి మధ్య ఉన్న పెట్రోల్ బంకు నుండి జగన్నాధపురం వరకు రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు జరిగి అనివార్య కారణాల వల్ల రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందని వాహనదారులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అధికారులు నూతన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.





## శంకరమ్మకు సన్మానం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంతచారి తల్లి తెలంగాణ మహిళ కమిషన్ రాష్ట్ర మెంబర్ కాసోజు శంకరమ్మ మొదటిసారి నేరేడుచర్ల మండలంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారులు ఆమెను కలిసి శాలువాతో ఘనంగాసన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు పంగా శ్రీను, లావుద్య శ్రీను నాయక్, పల్లెపంగు నాగరాజు, జింకల భాస్కర్, సైదులు, నాగయ్య పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రమౌళీశ్వర ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం పురోహితులు పాల సదాశివశర్మ హనుమాన్ చాలిసా పారాయాణను హనుమాన్ భక్తులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకం, అలంకరణ చేశారు. అనంతరం భక్తులను ఆశీర్వదించి, ప్రదక్షిణలు చేయించారు. హనుమాన్ చాలిసా పారాయణం ప్రతి రోజు పటించడం వలన మంచి జరుగుతుందని పురోహితులు అన్నారు. ప్రతి శనివారం జరిగే ఈ బృహత్తర కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈకార్యక్రమంలో హనుమాన్ భక్తులు బత్తుల పరమేష్, ఏరుకొండ రాము, దాచేపల్లి వెంకటేశ్వర్లు, నెలంటి వెంకటేశ్వర్లు, శ్రీహరి గోపాల చారి, తడకమళ్ళ శ్రీనివాస్, జగన్, నాగార్జున రెడ్డి, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి అండగా ఇఎల్‌వి ఫౌండేషన్



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో విద్య,వైద్యం,ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నిరుపేదలకు ఈఎల్‌వి ఫౌండేషన్ అండగా నిలుస్తుందని ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ అయితగోని నరసింహాగౌడ్ తెలిపారు.శనివారం మర్రిగూడలోని భారత్ గార్డెన్స్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాత్రికేయులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పందుల నివారణకు చర్యలు

**ప్రజాపక్షం/సూర్యాపేట (తుంగతుర్తి) :** పందుల నివారణకు చర్యలు చేపట్టాలని తుంగతుర్తి సర్పంచ్ మల్లెపాక సాయిబాబా సూచించారు. శనివారం తుంగతుర్తిలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 2 వరకు పూర్తిగా పందుల నివారణ చేపట్టాలని కోరారు. పలు వార్డుల్లో పందుల సంచారం పెరిగిపోవడంతో పారిశుద్ధ్యం క్షిణించి మురుగునీరు వ్యాపిస్తోంది. స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. సెక్రటరీ శ్రీనివాస్, వార్డు సభ్యులు ఎల్లబోయిన శ్రీకాంత్ పాల్గొన్నారు.



## శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా ప్రవిత్రోత్సవం

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం పవిత్రోత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7గంటలకు స్వామి వారికి అభిషేకం, పది గంటలకు స్వామి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అదే విధంగా ఆలయ అర్చకులు కందాల శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి విష్ణు సహస్రనామం, వేద విన్నపం, విశ్వస్సేన ఆరాధన, పుణ్యాహవచనము, రక్షబంధనం, అంకురారోహణ, పవిత్రములకు ధాన్యధివాసం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానానికి సహకరించిన కలకోవ గ్రామానికి చెందిన కందిబండ శ్రీనివాసరావురమాదేవి దంపతులు సుమారు 500 మందికి అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సత్యనారాయణ, సర్పంచ్ చల్లా గురవయ్య, పురోహితులు కందాల ప్రశాంతచార్యులు, దేవాలయ చైర్మన్ పొలిశెట్టి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వేనేపల్లి శైలజరమేష్‌బాబు, దేవాలయ కమిటి సభ్యులు వీరచారి, భక్తులు పాల్గొన్నారు.

## నీటి విడుదల చేసి రైతులని ఆదుకోవాలి

**ప్రజాపక్షం/హాలియా/నిడమనూరు:** సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నూకల వెంకట్ రెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ బావులు, బోర్ల కింద వరి సాగు చేసిన రైతులు వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దశలో నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 530 అడుగుల పైనే నీటి నిల్వ ఉన్నందున సాగర్ ఎడమ కాలవ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు నింపినస్తీతే రైతులకు కొంత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. నీటి విడుదల వలన భూగర్భ జలాలు కూడా కొంతమేర పెరిగే అవకాశం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎడమ కాలువకు నీటిని విడుదల చేసేలా నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించేలా కృషి చేయాలని కోరారు. కొద్దో గొప్పో అవకాశం అవకాశం ఉండి వరి సాగుచేసిన రైతులకు నీటి విడుదల చేసి ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రెడ్డి సంఘం నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి వేడుకలను సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రంథాలయ మాజీ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి, తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు వంగల అనిల్ రెడ్డి పాల్గొని రాజా బహదూర్ వెంకట రామారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ సమాజంలో విద్యాభివృద్ధికి,మహిళా విద్యకు, సామాజిక సేవకు విశేషంగా కృషి చేసిన మహనీయుడని అన్నారు.పోలీసు శాఖలో ఉన్నత పదవిలో పనిచేస్తూనే ప్రజా సేవకు అంకితమై,విద్యా సంస్థల అభివృద్ధికి,పేద విద్యార్థుల ప్రోత్సాహానికి తన వంతు కృషి చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రెడ్డి సంఘం జిల్లా నాయకులు గాదె సైదిరెడ్డి,కోమటిరెడ్డి అరుణ,బుచ్చిరెడ్డి,కంచరకుంట్ల వెంకట్ రెడ్డి,అలుగుబెల్లి వెంకట్ రెడ్డి, దొనాలా నాగార్జున రెడ్డి,గుండ్రెడ్డి వెంకట్ రెడ్డి,చెంతపల్లి సాధనలక్ష్మి,ఏమిరెడ్డి సతీష్ రెడ్డి,అలుగుబెల్లి శ్యామ్ సుందర్ రెడ్డి,మేరెడ్డి ప్రవీణ్ రెడ్డి, మెట్టు భాస్కర్ రెడ్డి, కోట్ల అశోక్ రెడ్డి తదితర కార్యకర్తలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాంపుల ఏర్పాటు అభినందనీయం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచిత క్యాంపులు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ఐఎంఎ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ పుల్లారావు పేర్కొన్నారు.పట్టణంలోని దేవరకొండ రోడ్డులోని శ్రీసత్యావతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి 4వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత క్యాన్సర్ క్యాంప్,రక్తదాన శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు.సత్యావతి ఆసుపత్రిలో ప్రతి సంవత్సరం మోకాళ్ల చిప్ప మార్పిడి చికిత్స చేయడం ఎంతో గర్వకారణమన్నారు.ప్రైవేట్ ఆసుపత్రులకు ఐఎంఎ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. 10వ వార్డు కార్పొరేటర్ పిల్లి కృష్ణమరాజు మాట్లాడుతూ గతంలో చిన్న సమస్య వచ్చినా చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించేవారని,ఇలాంటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి జిల్లా



కేంద్రంలో ఏర్పాటు అయిన తర్వాత ఆ సమస్యలు తీరిపోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలోఐఎంఎ నీలగిరి అధ్యక్షులు డాక్టర్ రమేష్,లయన్స్ క్లబ్ డైమండ్ మోహన్ రెడ్డి, ఆసుపత్రి మేనేజర్ సురేపల్లి సత్యనారాయణ, వైద్యులు సురేపల్లి రాం మనోహర్, సంపద, చైతన్య, అశ్విని పిల్లల ఆసుపత్రి డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ గణేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎస్‌పి కాలువల ద్వారా నీటిని అందించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట (తుంగతుర్తి) :** ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీటిని విడుదల చేసి తుంగతుర్తి ప్రాంత రైతులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు డిమాండ్ చేశారు. శనివారం తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలోని సిపిఎం కార్యాలయం నందు ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వర్షాభావ ప్రభావం వలన తుంగతుర్తి ప్రాంతంలో రైతులు వేసుకున్న వరి పంట ఆదిలోనే ఎండిపోతుందన్నారు. పెట్టుబడి పెట్టి కళ్ళముందే రైతుల పంట ఎండిపోవడం చేత నిరాశ చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ గోదావరి జలాలచే నిండి ఉన్నందున ఆ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు బుర్ర శ్రీనివాసు, పులుసు సత్యం, మండల కార్యదర్శులు దేవరకొండ యాదగిరి, జి. ఉప్పలయ్య పాల్గొన్నారు.



## ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 50 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. వాహన యజమానులతో అప్పటికప్పుడే వాహనాలకు నంబర్ ప్లేట్లు వేయించి, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. వాహనదారులు, పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోతే ఏదైనా ప్రమాదం లేదా నేరం జరిగినప్పుడు వాహనాన్ని గుర్తించడం చాలా కష్టమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని, చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా వెంకటేష్ మాదిగ డిమాండ్ చేశారు.శనివారం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.అనంతరం జిల్లా వెంకటేష్ మాదిగ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి (కార్మిక శా) విభాగంలోకి తీసుకురావడంతో పాటు స్కిల్స్ యూనివర్సిటీకి అనుసంధానం చేస్తూ తెచ్చిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గొల్ల కురుమ డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మాల్గ యాదయ్య, ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారపాక అంజి మాదిగ,బిసి,ఎస్‌సి,ఎస్‌టి జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర యాదవ్,పూదరి సైదులు,ఆదిమళ్ల సత్యనారాయణ,చనగళ్ల కోటేష్,యడవెల్లి శ్రీనివాస్,రేపాక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## హామీలను వెంటనే అమలు చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట (తుంగతుర్తి) :** ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆశా కార్యకర్తల మండల అధ్యక్షురాలు మేకల జయమ్మ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని వెంపటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లింగమూర్తికి వినతిపత్రం అందించి మాట్లాడారు. ఆశా కార్యకర్తలకు రూ.18వేల వేతనంతో పాటు ఉద్యోగభద్రత కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్ళు అవుతున్నా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, చిత్తలూరి రమ, యాక లక్ష్మి, లీలారాణి, షమీనా పాల్గొన్నారు.

## కోనేరు వద్ద ఆర్చ్ ప్రతిష్ట

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రవిత్సోత్సవాలను ఉదయం నుండి స్వామి వారికి అభిషేకాలు, కళ్యాణమహోత్సవం, సాయంత్రం వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కోనేరు వద్ద రూ.3.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆర్చ్ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిరికొండ వెంకటేశ్వర్లు అలివేలు దంపతులు, వారి కుమారులు సిరికొండ రాంబాబులక్ష్మి, చిట్యాల సిఐ సిరికొండ సురేష్ కళ్యాణి దంపతుల సహాకారంతో నిర్మించిన ఆర్చ్‌ని వారు ప్రారంభించారు.

## స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శక సేవలు

ప్రజాపక్షం/తిప్పర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు పార దర్శకంగా రేషన్ అందుతుందని తిప్పర్తి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బద్దం రజిత సుధీర్ అన్నారు. తిప్పర్తి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవర ణంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్య క్రమం ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో తహా సీల్దార్ రామకృష్ణతో కలిసి సర్పంచ్ బద్దం రజిత సుధీర్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ, ఉపసర్పంచ్ నూకల దేవ కమ్మ,తుమ్మల నాగరాజు,లవిశెట్టి కలమ్మ,గుండ సంతోష్, కిన్నెర రవి,వార్డు మెంబర్లు, గ్రామస్తులు, లబ్ధి దారులు తదితరులు పాల్గొన్నారు.

## తనపై వచ్చిన ఆరోపణలపై స్పందించిన డీటీ మొగిలి విజయ్‌శేఖర్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: తనపై వస్తున్న ఆరోప ణలు వాస్తవమైతే దేనికైనా సిద్ధమని డిప్యూటీ తహసీల్దార్ మొగిలి విజయ్‌శేఖర్ స్పష్టం చేశారు.ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేసే అధికారం తనకు లేదని, సంబంధిత అధికారం ఉన్నతాధికారులకే ఉంటుందని తెలి పారు.కుటుంబ సభ్యుల మధ్య ఉన్న వివాదాలను తనపై రుద్దడం సమంజసం కాదని డీటీ అన్నారు. మార్చి 18న ఎమ్మార్వో కార్యాలయం నుండి ఇరుపక్షాలకు నోటీ సులు జారీ చేసినట్లు తెలిపారు.ఇరు పక్షాలను ఆర్డీవో సమక్షంలో విచారణలకు హాజరుకావాలని ఉన్నతాధికా రులు సూచించినట్లు వెల్లడించారు.ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇవ్వడం లేదా నిలిపివేయడంలో తనకు ఎలాంటి అధి కార పరిధి లేదని స్పష్టం చేశారు. తనపై చేస్తున్న ఆరోప ణల్లో వాస్తవం లేదని, తనపై కుట్రపూరితంగా ఆరోప ణలు చేస్తున్నారని విజయ్‌శేఖర్ పేర్కొన్నారు.

## రిషిత వైన్స్‌లో చోరీ



ప్రజాపక్షం/అర్వపల్లి : రిషిత1 వైన్స్ దుకాణంలో శుక్ర వారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వైన్‌షాప్ షట ర్లను పగులకొట్టి చోరీ చేశారు. శనివారం ఉదయం పేప ర్‌బాయ్ షట్టర్ లేపి ఉండడాన్ని చూసి వైన్స్ దుకాణదా రులకు సమాచారాన్ని అందజేసినట్లు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అర్వపల్లి ఎస్ఐ మధు తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీ లించి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో నాగారం సిఐ నాగేశ్వరరావు క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ చోరీకి ముగ్గురు వ్యక్తులతో కూడిన టీంగా వచ్చినట్లు సిసి కెమెరాలో నమోదైంది. అయితే దొంగలు రూ.35వేల నగదును, రూ.22వేల విలువైన మద్యాన్ని దొంగలించారని వైన్ షాపు నిర్వాహకులు ఉపేందర్ ఫిర్యాదు చేశారు. పోలీ సులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## జనాభా గణన సర్వేను విజయవంతం చేయాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: జనాభా గణన2027లో భాగంగా చేపట్టే గ్రామ వివరాల (విలేజ్ డిక్షనరీ) సర్వేను అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయ వంతం చేయాలని మిర్యాలగూడ డివిజన్ గణాంక అధి కారి ఆర్.రవీందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సైదిరెడ్డి సూచించారు. శనివారం మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో జనాభా గణన సూపర్ వైజర్లు, గ్రామ పరిపాలన అధికారులతో సన్నాహక సమావేశం నిర్వ హించారు.గ్రామ వివరాల సేకరణ ప్రక్రియను సెప్టెం బర్ 2 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం



ప్రజాపక్షం/నందికొండ: రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని నందికొండ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు.రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి 146వ జయంతి వేడు కలను శనివారం నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీలో రెడ్డి జనసేవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి హాజరై రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి విద్య, సామాజిక సేవ, సమాజ అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలు పునిచ్చారు.ఈ కార్యక్రమంలో నందికొండ మున్సి పల్ చైర్ పర్సన్,వైస్ చైర్మన్,కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ సమీక్ష సమావేశం



ప్రజాపక్షం/తిరుమలగిరిసాగర్: మండల కేంద్రం లోని రైతు వేదికలో మండల స్థాయిలో గ్రామాల అభివృద్ధి, సామర్థ్యాల నిర్వహణ కార్యక్రమాలపై మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిం చారు.మండల ప్రత్యేక అధికారి ఎం. సరిత (ఏ డీఏ) అధ్యక్షతన ఎజెండా వారీగా సమీక్ష నిర్వ హించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసుకో వాలని సర్పంచులకు సూచించారు. అదేవిధంగా విద్యుత్ సమస్యలకు సంబంధించి అన్ని గ్రామాల్లో థర్డ్ వైర్ ఏర్పాటు చేయాలని సంబంధిత ఏఈని కోరారు. ఫారెస్ట్ భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని నెల్లి కల్, తాటిపాముల తండా సర్పంచులు తహసీల్దార్ దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరించాలని సూచించారు.అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి గ్రామాల్లో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ఈ సమావే శానికి హాజరు కాని ఫారెస్ట్, ఆర్‌అండ్‌బి,ఎస్‌సి వెల్ఫేర్ అధికారులపై చర్యలు తీసుకుంటామని సమావేశంలో తీర్మానించారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీను,తహ సీల్దార్ అనిల్ కుమార్, మండల విద్యాధికారి కె. శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటయ్య, ఏఈ ఎలక్ట్రిసిటీ వెంకట్ రెడ్డి, వెటర్నరీ డాక్టర్ పరశురాం, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## అనామలీస్ ఓటర్లకు నోటీసులు.. బిఎల్ఓలకు శిక్షణ



ప్రజాపక్షం/నాంపల్లి: మునుగోడు నియోజకవ ర్గంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) లో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చండూర్ ఆర్‌డిఓ శ్రీదేవి మాట్లాడుతూ ఓటరు జాబితా అత్యంత పారదర్శకంగా, తప్పులు లేకుం డా ఉండాలన్నారు. అన్‌మ్యాపింగ్ అనామలీస్ ఓటర్ల విషయంలో బీఎల్ఓలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.ఓటరు జాబితాలో అనుమానాస్పదంగా ఉన్న 470 అనామలీస్ ఫిర్యా దులు, 3154 పేరు సవరణలు, 3624 మంది ఓట ర్లకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలి పారు.ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.అనంతరం బీఎల్ఓలకు ఓటరు జాబితా పరిశీలన,మార్పులుచేర్పులు,తొలగింపులకు సం బంధించిన నిబంధనలపై అధికారులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనే యులు,ఎంపీడీవో రామకృష్ణ శర్మ, ఏఈఆర్ ఓలు,రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో భూసార పరిరక్షణ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిం చడం వల్ల భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు సాగు ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వల్లోజు వినోద్‌కుమార్ అన్నారు. శనివారం ఆత్మ ఆధ్వర్యంలో ఆర్‌పిఎల్ ఆధారిత ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కె.జగదీశ్వర్‌రెడ్డి, కేవికే శాస్త్రవేత్త రాము లమ్మ, మండల వ్యవసాయ అధికారి ఎం.రుషేంద్ర మణితో కలసి ఆయన హాజరై మాట్లాడారు. రైతులు జీవామృతం, కషాయాలు వంటి దేశీయ పద్ధతులు ఉపయోగించి పంటలను సాగు చేయాలని కోరారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్ప త్తులు సాధించడమే ప్రకృతి వ్యవసాయ ముఖ్య లక్ష్యమని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితు లను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు ప్రత్యామ్నా యంగా తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకో వాలని సూచించారు. కంది, పెసర, మినుములు, నువ్వులు, జొన్న, సజ్జ, ఆముదం వంటి పంటలను స్థానిక నేల స్వభావానికి అనుగుణంగా సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, కిసాన్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బిటిఎమ్ గిరి, ఏఈఓలు అఫీన్, నాగయ్య, అలగడప సర్పంచ్ ఇంద్రపల్లి కుమారి, ఇంద్రపల్లి శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, సైదులు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావంతో పత్తి పంటకు నష్టం

ప్రజాపక్షం/మర్రిగూడ: మండలంలోని శివన్నగూడెం గ్రామంలో శనివారం పత్తి పంటను క్షేత్రస్థాయిలో మునుగోడు వ్యవసాయ సంచాలకులు వేణుగోపాల్ పరిశీలించారు.రైతుల పొలాల వద్దకు నేరుగా వెళ్లి పంట పరిస్థితిని,నేలలో తేమ శాతాన్ని, పురుగు మందుల ప్రభావాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్రిగూడ మండలంలో సుమారు 24,269 ఎక రాల్లో పత్తి పంట సాగవుతుందని తెలిపారు. తేమ లేని సమయంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణకు వాడా ల్సిన మందులపై రైతులకు అవగాహన కల్పించారు. అవసరమైతే వ్యవసాయ శాఖను సంప్రదించాలని సూచించారు.ఆయన వెంట వ్యవసాయ అధికారి సాహూష్, స్థానిక రైతులు ఉన్నారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం



ప్రజాపక్షం/నందికొండ : నందికొండ మున్సిపాలిటీ హిల్‌కాలనీ 4వ వార్డులో ఇటీవల షార్ట్‌సర్క్యూట్ కారణంగా గృహంలోని సామగ్రి దగ్ధమైన అలిగా హరికాంత్ కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి తక్షణ అవసరాల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజే శారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రమా దంతో నష్టపోయిన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్య క్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ మంద గౌతమీ రఘువీర్ బిన్నీ, కాంగ్రెస్ నాయకులు రాకం చిట్టి, మాయకోటి శంకర్,ఎంఆర్‌పిఎస్ నాయకులు చుక్క ప్రభాకర్ పాల్గొన్నారు.

## వీధికుక్కల బెడద- మేకలు, గొర్రెలు మృతి



ప్రజాపక్షం/మునగాల: వీధికుక్కల దాడిలో 11 గొర్రెలు, మేకలు మృతి చెందిన సంఘటనమండల పరిధిలోని నారాయణగూడెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామా నికి చెందిన దాసరి రామకృష్ణ జీవాల కొట్టంలోకి వీధి కుక్కలు జొర బడి జీవాల మందపై దాడిచేయగా తీవ్రగాయాలై 11 జీవాలు మృతి చెందినట్లు గొర్రెల కాపరి రామకృష్ణ తెలిపారు. వీటి విలువ సుమారు 1.50 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ పాలకవర్గం గ్రామంలోని వీధి కుక్కలను నిర్మూలించాలని, అంతేకాకుండా ప్రజలపై కూడా దాడి చేస్తున్నట్లు తెలిపారు. దాసరి రామకృష్ణకు ప్రభుత్వం నుండి తనకు ఆర్థికసాయం అందించాలని కోరారు.

## బిసిల పట్ల పాలకులు వివక్ష తగదు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ నాయ కులకు ఒక న్యాయం, అగ్రవర్ణాల నాయకులకు మరొక న్యాయం అమలు చేయడం తగదని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీ సమాజాన్ని అణిచివేస్తున్న నాయకుల అహంకార పూరిత విధానాలను ఖండిస్తూ శనివారం మిర్యాలగూడ పట్టణంలో బీసీ యువజన సంఘం ప్రతినిధుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా మంత్రి కొండా సురేఖ కుమార్తె చేసిన కొన్ని వ్యాఖ్యలను నెపంగా చూపి మంత్రికి నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కు నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ దాసరాజు జయరాజ్ పాల్గొన్నారు.



## 97 జిఓను రద్దు చేయాలని విద్యార్థుల నిరసన

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలలకు లాభం చేకూర్చేందుకు తెచ్చిన 97 జిఓను రద్దు చేయాలని పాలిటెక్నిక్, డిప్లమా విద్యార్థులు శనివారం జిల్లా కేంద్రంలో శాంతియుత నిరసన ర్యాలీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మద్దతుగా బిఎస్ఎఫ్ పార్లమెంట్ ఇంచార్జి, జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు, జిల్లా ఇంచార్జ్ అఖిల్‌లు హాజరై మాట్లాడుతూ కార్మిక శిక్షణ ఉపాధి, కర్మాగారం పేరును శక్తి స్కిల్ మ్యాప్ అండ్ క్యాపిటల్ నాలెడ్జ్ ట్రెనింగ్‌గా మార్చడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబురావు, ఈదుల యాదగిరి, చెరుకుపల్లి లక్ష్మణ్, చింత నవీన్, పాలిటెక్నిక్, డిప్లమా విద్యార్థులు పాల్గొన్నారు.

## టిపిసిసి ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా వైస్ చైర్మన్‌గా వెంకటయ్య

ప్రజాపక్షం/డిండి; తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి ఎస్సీ డిపార్ట్‌మెంట్ నల్గొండ జిల్లా వైస్ చైర్మన్‌గా మండలంలోని నిజాంనగర్ గ్రామానికి చెందిన నల్లవెల్లి వెంకటయ్య నియామకమయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, టిపిసిసి నాయకత్వానికి, ఎస్సి డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ మానకొండూరు ఎంఎల్ఏ డా. సత్యనారాయణ, దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్, జిల్లా చైర్మన్ స్వామిలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, భారత రాజ్యాంగం అందించిన సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే విలువలకు కట్టుబడి పనిచేస్తూ, ఎస్సీ వర్గాల హక్కులు, సంక్షేమం, అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేయనున్నట్లు వెంకటయ్య తెలిపారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మై భారత్ నవభారత్ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా, హర్ ఘర్ తిరంగా ర్యాలీ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవభారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్ పాల్గొని యువత, విద్యార్థులకు స్వచ్ఛత, దేశభక్తి, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు వెంకటేశం, హరికృష్ణ, ఇమ్రాన్, శ్రీనివాస్ రెడ్డి, సుమా, అవనీధర్, నర్సింహా, నవభారత్ యూత్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. దేశభక్తి, పరిశుభ్రత, సామాజిక బాధ్యత వంటి విలువలను యువతలో పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు.



# కూసుకుంట్ల చేసిన ఆరోపణలో వాస్తవం లేదు

**గుడిలో ప్రమాణానికి రాకపోవడంతో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మండిపాటు**



ప్రజాపక్షం/చండూరు: తనపై మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలో వాస్తవం లేదని ,గుడిలో ప్రమాణం చేద్దామని మాట ఇచ్చి తప్పుకోవడంతోనే ఆయన చేసిన ఆరోపణలో నిజం లేదని తేలిపోయిందని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ తాను ఏలాంటి తప్పు చేయలేదని అందుకే ఇచ్చిన మాట ప్రకారం ఆలయానికి వచ్చి ప్రమాణం చేయడానికి సిద్దంగా ఉన్నానని అన్నారు. తనపై వచ్చిన ఆరోపణలో వాస్తవం లేదన్న విషయం కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రమాణానికి హాజరు కాకపోవడంతో తేలిపోయిందని అన్నారు. ఇకనైన ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. నియోజకవర్గం ప్రజలు ఇక కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాటలను నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐతరాజు మల్లేశం , వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , కౌన్సిలర్లు కలిమికొండ పారిజాత జనార్దన్ , కోడి సుష్మావెంకన్న, బుషిపాక వాసు, కటకం రమేష్ , ఖలీల్ , మొగుదాల వెంకన్న సతమ్మ ,కల్లెట్ల చంద్రకళ మారయ్య , మాజీ వైస్ చైర్మన్ దోటి వెంకటేష్ యాదవ్ , కారింగు రాంమూర్తి , పున్న సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఒక్క అర్హుడి ఓటు గల్లంతు కాకూడదు



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఏ ఒక్క అర్హుడి ఓటు గల్లంతు కాకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు బిఎల్ఎలకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బిజెపి పట్టణ కార్యాలయంలో ఓటర్ లిస్ట్ సవరణ సర్2 కార్యక్రమంపై బిఎల్ఎలకు అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా సవరణ అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఘట్టమన్నారు. జాబితా సవరణల సమయంలో సాంకేతిక కారణాల వల్ల లేదా ప్రతిపక్షాల కుట్రల వల్ల తప్పులు దొర్లే ప్రమాదం ఉందన్నారు. తద్వారా ఓటర్లకు నోటీసులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. నోటీసులు వచ్చిన ప్రతి సందర్భంలోనూ క్షేత్రస్థాయిలో బిఎల్ఏ2లు వెంటనే స్పందించాలన్నారు. సదరు ఓటరుకు పూర్తి అండగా నిలిచి, ఎన్నికల అధికారులకు సరైన వివరణలు, ఆధారాలను సమర్పించాలన్నారు. ఏ ఒక్క జాతీయవాద ఓటు కూడా జాబితా నుండి గల్లంతు కాకుండా కాపాడాల్సిన పూర్తి బాధ్యత బూత్ స్థాయి ఏజెంట్లపైనే ఉందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన శంషాబాద్ నుండి చెన్నై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు సూర్యాపేట పట్టణం మీదుగా వెళ్లేలా తాము గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లమల్ల నరసింహా, ఎండి అబిద్, సలిగంటి వీరేందర్, అలుగుబెల్లి సైదిరెడ్డి, మాధవరపు అనిల్, పందిరి రాంరెడ్డి, పేర్వాల లక్ష్మణ రావు పాల్గొన్నారు.

# విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన



ప్రజాపక్షం/అడ్డగూడూరు : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాలల హక్కుల పరిరక్షణ, మరియు 1098,100, 108, 112, తదితర టోల్ ఫ్రీ నెంబర్ల గురించి, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు పై అవగాహన కల్పించడం. గుడ్ టచ్, బాడ్ టచ్, మానసిక, శారీరక వేధింపులు ఎదురైనప్పుడు విద్యార్థినీలు అనుసరించాల్సిన పద్ధతులు, మెలకువలు మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సరిత, పోలీసు అధికారి వెంకన్న, పాఠశాల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్వప్నా దేవి, అగ్రి లీగల్ క్లినిక్ కానుగంటి శ్రీశైలం, పారాలిగల్ వాలంటీర్ కురిమేటి యాదయ్య, ఐతికాల లింగయ్య, ఉపాధ్యాయులు లక్ష్మణ్, మహేష్, నరేష్, వెంకటేష్, కల్యాణి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పాలనలో కళకళ.. కాంగ్రెస్ పాలనలో వెలవెల



ప్రజాపక్షం/నకిరేకల్ : కెసిఆర్ హయంలో చెరువులు,కుంటలు నిండుకుండలా కళకళాడితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువులు కాలువలు ఎండిపోయి రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నకిరేకల్ పట్టణంలోని పెద్ద చెరువును ఆయన సందర్శించి మాట్లాడారు గతంలో పట్టణంలోని పెద్ద చెరువు నీటితో కలకలలాడేదని, నేడు వెలవెలబోతుందన్నారు. కేసీఆర్ హయాంలో నకిరేకల్ నియోజకవర్గంలోని పెద్ద చెరువుతో పాటు అయిటిపాముల, గొల్లపాడు, బొల్లెపల్లి, మంగళపల్లి, నోముల,కడపర్తి తదితర ప్రాంతాల్లోని చెరువులకు ఎంఆర్‌పి ద్వారా నీరు అందించామన్నారు.పానగల్ లిఫ్ట్ నుంచి బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి,తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ట్రయల్ రన్ నిర్వహించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ప్రగడపు నవీన్ రావ్,మారం వెంకట రెడ్డి,యూత్ విభాగం మండల అధ్యక్షులు పేర్ల కృష్ణ కాంత్,మండల కార్యదర్శి నోముల కేశవరాజు,సర్పంచులు గొర్ల వీరయ్య,బంటు రవి,సైదిరెడ్డి, నాయకులు రావిరాల మల్లయ్య, లింగారెడ్డి, గణేష్,వెంకన్న, జాఫర్,అమీర్ పాషా,వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు బీమా చెల్లించి పేద రైతు కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్రంలోని పేద రైతు కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే రైతు బీమా ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయాలని రైతు బంధు సమితి నల్గొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మిర్యాలగూడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 70 లక్షలకు పైగా ఉన్న రైతుల భద్రత కోసం ప్రభుత్వం చెల్లించాల్సిన రైతు బీమా ప్రీమియం గడువు ముగిసినప్పటికీ ఇప్పటికీ రెన్యువల్ చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రీమియం చెల్లించకపోవడం వల్ల మిర్యాలగూడ మండలం యాద్గార్ పల్లికి చెందిన గిరిజన రైతు చందు నాయక్ ఇటీవల మరణించగా, ఆ కుటుంబానికి బీమా పరిహారం అందక రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రవీందర్ నాయక్, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య పరీక్షలు



ప్రజాపక్షం/చండూరు: చండూరు మున్సిపాలిటీలోని గాంధీజీ విద్యా సంస్థల యందు చదువుతున్న 150 విద్యార్థులకు రవీత హాస్పిటల్ ఎండి డాక్టర్ నాగిళ్ల నర్సింహ్మా సౌజన్యంతో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ హేమలత నాగిళ్ళ (ఎం ఎస్ ఆప్త మాలజీ) , డాక్టర్ రవితేజ నాగిళ్ల జనరల్ ఫిజీషియన్ చే విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ హేమలత మాట్లాడుతూ విద్యార్థులు కంటి సమస్యలు రాకుండా ఏలాంటి జాగ్రతలు తీసుకోవాలి , చదువుకునే సమయంలో ఏ విధమైన జాగ్రతలు పాటించాలనే అంశంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ , చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు , రవీత హాస్పిటల్ ఎండి డాక్టర్ నాగిళ్ల నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## వంగూరు లక్ష్మయ్య (పూ) గురుస్వామికి గురు పురస్కారం

ప్రజాపక్షం/నకిరేకల్ : అయ్యప్ప తత్వాన్ని స్వీకరించి విస్తృతం చేసేందుకు పాటుపడుతూ ధార్మిక సేవ చేస్తున్న గురువర్యులకు మహాశాస్త సేవా సంఘం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో గురు పురస్కారాలను ప్రధానం చేశారు.కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన సాయి మణికంఠ ఆలయ గురు స్వామి వంగూరు లక్ష్మ(పూల గురుస్వామి)కిఈ అవార్డుకు ఎంపిక చేశారు.పూల గురుస్వామి తోపాటు సతీమణి లక్ష్మిలకు గురు పురస్కారాన్ని శబరిమలై అయ్యప్ప స్వామి వంశస్థులైన పందల వంశీయుడు సురేష్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరై అవార్డును ప్రధానం చేశారు.ఈ అవార్డు కింద జ్ఞాపికను అందజేస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హరిహరపుత్ర సేవా సమితి ప్రధాన కార్యదర్శి సోము,కోశాధికారి పొట్టబత్తుల కృష్ణమూర్తి,ఆర్యన్ భజన్స్ పిల్లల మర్రి ఉపేందర్,వంగూరి మణికంఠ మిత్రులు పాల్గొన్నారు.






# రహీంఖాన్ పేట స్టేజి వద్ద అన్ని బస్సులు ఆగాలి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండలంలోని రహీం ఖాన్ పేట స్టేజి వద్ద అన్ని డిపోలకు చెందిన ఎక్స్ప్రెస్, డీలక్స్ బస్సులు ఆపాలని యాదగిరిగుట్ట డిపో సిఐకి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, సహాయ కార్యదర్శి ఎండీ నయీమ్ పాల్గొన్నారు.

# పోచంపల్లి పిఏసిఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్

### వైస్ చైర్మన్ కొట్టం కరుణాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచం పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా పాక మల్లేష్ యాదవ్ వైస్ చైర్మన్‌గా కొట్టం కరుణాకర్ రెడ్డి లను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, సహకార డిపార్ట్ మెంట్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి సహకార సంఘ ఎన్నికలు జరిగే వరకు పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహాయంతో ఈ నియామక పత్రాలను ఇరువురు అందుకుని ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. నియామకం పట్ల జిల్లా మండల వ్యాప్తంగా వివిధ క్యాడర్లో కాంగ్రెస్ ముఖ్య నాయకులు వివిధ హోదాలలో పనిచేస్తున్న పార్టీ శ్రేణులు కార్యకర్తలు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ మెంబర్‌గా సోమయ్య



**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్గా నియామకం చిర్రగూడూరు గ్రామానికి చెందిన మందుల సోమయ్య తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల సామేల్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం దిశగా ఈ బాధ్యతలను సోమయ్య సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లింగాల నర్సిరెడ్డి, అడ్డగూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పోలబోయిన లింగయ్యయాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఇటుకాల చిరంజీవి, టీపీసీసీ రాష్ట్ర నాయకులు బాలెంల సైదులు, కేసరపు శ్రీనివాస్ రెడ్డి, పూజారి నరసయ్య మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ చర్యలు

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : గ్రామాల్లో అమలవుతున్న వీబిజి రామ్‌జి పథకాన్ని పక్బందీగా అమలు చేయాలని క్లస్టర్ నోడల్ అధికారి,జెడ్పీ సిఈఓ శోభారాణీ అన్నారు. చౌటుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో వీబిజి రామ్‌జీ పథకం అమలుపై క్లస్టర్ స్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు.ఫామ్‌పాండ్స్,మ్యాజిక్ సోకోఫిట్స్, బోర్‌వెల్స్ రీచార్జ్ పనులతో పాటు ఇంకుడుగుంతకు అధిక ప్రాధన్యం ఇవ్వాలని సూచించారు.ఎల్‌నినో నేపథ్యంలో కరువును అధికమించేలా ప్రణాళికలు ఉండాలని చెప్పారు. ఆయా మండలాల ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఏపిఓలు, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

# కబ్జా ఆరోపణలపై భూమిని పరిశీలించిన రెవెన్యూ అధికారులు

**ప్రజాపక్షం/మునుగోడు:** మంగల్‌దొడ్లగూడెం గ్రామ సమీపంలోని లావుని పట్టా భూమిని ఇతరులు ఆక్రమించారంటూ వచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.బాధితుడు కోడి రాములు తనకు ప్రభుత్వం కేటాయించిన భూమిని ఇతరులు ఆక్రమించారని నల్లగొండ జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు.బాధితుడి వివరాల ప్రకారం అప్పటి ప్రభుత్వం ఉత్తర్వు నంబర్ 5927/96 ప్రకారం సర్వే నంబర్ 623లో కోడి రాములకు రెండు ఎకరాల వ్యవసాయ భూమిని లావుని పట్టాగా మంజూరు చేసి ధ్రువపతం అందజేసింది.అప్పటి నుంచి కోడి రాములు కుటుంబ సభ్యులు కొంత కాలం ఆ భూమిని సాగు చేసుకుంటూ వ్యవసాయం ద్వారా జీవనం సాగించారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంతకాలం క్రితం ముంబైకి వలస వెళ్లడంతో భూమి సాగుకు దూరమయ్యారు.అయితే తన గైర్హాజరీలో కొందరు గ్రామస్తులు ప్రజాప్రతినిధుల సహకారంతో రెవెన్యూ అధి



కారుల ద్వారా భూమికి హద్దులు ఏర్పాటు చేయించుకున్నారని కోడి రాములు ఆరోపించారు.ఈ నేపథ్యంలో శనివారం మునుగోడు మండల తహాసీల్దార్ నేలపట్ల నరేష్,ఆర్ఐ వంశీ,సర్వేయర్,జీపీఓతో కలిసి వివాదాస్పద భూమిని పరిశీలించారు. భూమికి సంబంధించిన హద్దులను పరిశీలించి, పంచనామా నిర్వహించి సర్వే చేపట్టారు.భూమికి సంబంధించిన రికార్డులు, క్షేత్రస్థాయి సర్వే వివరాలను పరిశీలించిన అనంతరం సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి,తదుపరి చర్యలకు సిఫారసు చేస్తామని తహసీల్దార్ నేలపట్ల నరేష్ బాధితులకు తెలిపారు.

# అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దాం..



**ప్రజాపక్షం/భువనగిరి** : ఎమ్మార్పీఎస్ భువనగిరి మండలం ఇంచార్జ్ దుబ్బ రామకృష్ణ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి భువనగిరి పట్టణ కమిటి సమావేశం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం రిటైర్డ్ ఎంప్లాయ్ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్,ఎంఎస్‌పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు సెప్టెంబర్ 9న వరంగల్లో జరగబోయే జాతీయ ఎంఆర్పిఎస్ ఎంఎస్పి నూతన మండల కమిటీ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంఆర్పిఎస్ భువనగిరి పట్టణ కమిటీని ప్రకటించారు. నూతన పట్టణ కమిటీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా అందే సాయి మాదిగ, అధికార ప్రతినిధిగా కలకొండ శ్రీధర్ మాదిగ, ఉపాధ్యక్షుడు దండు గణేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి పొలిశెట్టి సతీష్ మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నిరు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, ఎంఎస్‌పి మాజీ జిల్లా అధికారప్రతినిది సందేలా శ్రీనివాస్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, అనంతరం గ్రామ సర్పంచ్ పల్లెపటి రాజలింగం, ఎంఎల్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గద్యపాక శంకర్ మాదిగ, బండారు శివశంకర్ మాదిగ, కోట ఉపేందర్ మాదిగ, నరికడప నర్సింగ్ రావు మాదిగ, మంచాల మహేష్ మాదిగ, నరికడప మధు మాదిగ, గూడెంకి ప్రమోద్ మాదిగ, బర్రె వరుణ్ మాదిగ, ఇటుకల మహేందర్ మాదిగ, మహేష్ మాదిగ, కృష్ణ మాదిగ, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రసాయన పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలతో కార్మికులకు రక్షణ కల్పించేలా చర్యలు

**భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రసాయన పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు కల్పించి కార్మికులకు రక్షణ కల్పించేలా కఠిన చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కలెక్టర్‌ను కోరారు. పోచంపల్లి మండలం దోతీగూడెం గ్రామంలో హెజెలో ఫార్మా ప్రమాద బాధిత కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. ఫార్మా కంపెనీలో శుక్రవారం రాత్రి రియాక్టర్ పేలుడు సంభవించికార్మికులు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను గాంధీ ఆసుపత్రిలో కలిసి వారికి ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గతంలో కూడా ఈ కంపెనీలో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఘటనను గతంలోని తీవ్రంగా పరిగణించారన్నారు. భువనగిరి జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. యశోద, సన్రైజ్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండటంతో పాటు, కంపెనీ యాజమాన్యం నుంచి తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాక మల్లేష్ యాదవ్, డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవ రెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ సామా మోహన్ రెడ్డి, అంబరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కామ్రేడ్ గోరేటి రాములుకు విప్లవ జోహార్లు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ఎఐటియుసి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కామ్రేడ్ గోరేటి రాములు అనారోగ్యంతో బాధపడుతూ కొద్ది సేపటి కిత్రం కన్నుమూశారు. పార్టీ కార్యకర్తల సందర్శనార్థం సమయం 6 నుండి7 గంటల వరకు సిపిఐ కార్యాలయం వద్ద ఆయన పార్థివ దేహం ఉంటుంది. అంత్యక్రియలు రేపు మధ్యాహ్నం వారి స్వగ్రామం అయిన నల్గొండ జిల్లా నాంపల్లి మండలం పసునూరు గ్రామంలో జరుగుతాయి. కామ్రేడ్ గోరేటి రాములు గత 26 సంవత్సరాలుగా విద్యార్థి, యువజన ప్రజానాట్యమండలి ప్రస్తుతం ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. 2014లో దాతరపల్లి గ్రామ ఎంపీటీసీగా పోటీ చేయడం జరిగింది. వారికి ఒక కుమార్తె కుమారుడు ఉన్నారు. వారి మరణం కమ్యూనిస్టు పార్టీకి కార్మిక వర్గానికి తీరని లోటు. వారికి సంతాపం,విప్లవ జోహార్లు తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయుడి విశేష కృషి



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గడ్డం శ్రీనివాసరెడ్డి గత సంవత్సరం విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. 2025/26 విద్యా సంవత్సరంలో గ్రామస్తుల సహకారంతో తల్లిదండ్రుల సహకారంతో గ్రామంలో ఉన్న ప్రజాప్రతినిధుల సహకారంతో తన తోటి ఉపాధ్యాయుల సహకారంతో గ్రామ యువత సహకారంతో విద్యార్థుల యొక్క చదువుకు నేను హామీ ఇస్తున్న అని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను దాతల సహకారంతో ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు కల్చరల్ ఆక్టివిటీస్ చక్కని విద్య చక్కని హ్యాండ్ రైటింగ్ గేమ్స్‌తో కూడుకున్నటువంటి లెర్నింగ్ స్టడీ అవర్స్ లెర్నింగ్ వారి యొక్క ప్రత్యేక డ్రెస్ కోడ్ చాలా అభినందనీయ విషయమని, ఏది ఏమైనా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను దాతల సహకారంతో ఏర్పాటు చేసిన గడ్డం శ్రీనివాసరెడ్డికి గ్రామస్తులు అభినందనలు తెలిపినారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలోని జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సధస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ శిరీషా పాల్గొన్నారు. విద్యార్థులకు చైల్ లేబర్ యాక్ట్, రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్, చైల్డ్ ప్రొటెక్షన్ యాక్ట్, ట్రాఫిక్ రూల్స్, ఫోక్సో, డ్రగ్స్ కన్సప్షన్ వంటి చట్టాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర సర్పంచుల ఫోరం JAC కార్యదర్శి సర్పంచ్ గర్ధాస్ విక్రమ్, కోర్ట్ సిబ్బంది మన్నన్ ఖాన్, పాపయ్య, సునీల్, ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, కే.లింగచారి, పీడీ మని ఉపాధ్యాయులు ఏఏపిసి చైర్మన్ కొమ్మగోని మమత, నాగు నిరోషా, పగుడాల నరేందర్, వెలిమినేటి నరేష్, భువగిరి మధు, మేకల నరేందర్, గర్ధాస్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జోగుల నరసయ్యకు సన్మానం

**ప్రజాపక్షం/రామన్నపేట ః** రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మాజీ తొలి సర్పంచ్ జోగుల రామలింగయ్య కనిష్ట పుత్రుడు జోగుల నరసయ్య అడిషనల్ డిప్యూటీ కమిషనర్ సికింద్రాబాద్ కి ఉత్తమ పోలీసు అవార్డు రాష్ట్రపతితో తీసుకున్న సందర్భంగా గ్రామంలోని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియజేయనైనది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నతనం నుంచి కష్టపడి మారుమూల ప్రాంతమైన మా గ్రామం నుండి ఉన్నత స్థాయి అధికారిగా సేవలందిస్తూ రాష్ట్రపతి అవార్డు తీసుకురావడం మా గ్రామానికి గర్వకారణం అని అన్నారు.



# సురవరం సుధాకర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుద్దాం



**ప్రజాపక్షం/మునుగోడు:** సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి,మాజీ నల్లగొండ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం మండల సమితి ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,మండల కార్యవర్గ సభ్యులు దుబ్బ వెంకన్న,ఏఐటీయూసీ మండల కార్యదర్శి బెల్లం శివయ్య,పందుల వెంకన్న,గుండె అంజయ్య,బజారు హమాలీ కార్మిక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చిట్యాల:** సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి, పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో సిపిఐ నాయకులు శనివారం ఘణంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొడిగె సైదులు, మండల కార్యదర్శి ఎండి అక్బర్‌లు పాల్గొని మాట్లాడుతూ సురవరం పేదల పక్షాన నిలబడి పార్లమెంట్‌లో తన గళం ద్వారా అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ షరీఫ్, బొలుగూరి లింగయ్య, పసుల దేవేందర్, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, ఏళ్ళ రవి, కృష్ణయ్య, సోమగోని రవి, కడగంచి రామలింగయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం ఉద్యమ కెరటం సురవరం సుధాకర్ రెడ్డి అని ప్రజా ఉద్యమం కోసం జీవితాంతం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమాని హరిచంద్ర ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రామచంద్రయ్య, మండల కార్యవర్గ సభ్యులు స్వామి, వెంకన్న, ఆంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/దేవరకొండ;** సురవరం సుధాకర్‌రెడ్డి పోరాటం, ఆలోచనలు స్ఫూర్తి దాయకం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి అన్నారు. మొదటి వర్ధంతి సందర్భంగా దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో అమరజీవి సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు వెంకటయ్య,మైనోద్దిన్, ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీను, రాజ మల్లయ్య,మల్లేష్, కృష్ణయ్య, వెంకటయ్య, పాండు, మల్లయ్య, బక్కయ్య తదితరులు ఉన్నారు.



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శ్రామిక వర్గాల హక్కులు, నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజా ఉద్యమ నాయకుడు సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, మండల సమితి సభ్యులు సౌలె జగన్, బంటు రాజేశ్వరి, ఎస్కే షమీం, బంటు బుచ్చయ్య, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి లోకేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మోత్కూరు :** బడుగు, బలహీనవర్గాల కోసం నిరంతరం కృషి చేసిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్ అన్నారు. శనివారం స్థానిక కేఆర్ భవనంలో సూరవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం నాడు సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పులకరపు మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొగుళ్ల శేఖర్ రెడ్డి, బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షులు పెండెం, వెంకటేశ్వర్లు, ఏఐటియుసి మండల కార్యదర్శి జంగ నర్సయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి తాడూరు లక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల కేంద్రంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చేడే చంద్రయ్య, మండల కార్యదర్శి రేఖల శ్రీనివాస్, కంచనపెల్లి ఉపసర్పంచ్ బెల్లి శ్రీకాంత్, సుదర్శన్ రెడ్డి, దళితహక్కుల పోరాటసంఘం మండల కార్యదర్శి చేడే సందరయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండల కేంద్రంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ



జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, సహాయ కార్యదర్శి ఎండి నయీమ్, వర్గ సభ్యులు యాస బుచ్చిరెడ్డి, జల్లి రాములు, జక్క దయాకర్ రెడ్డి, బొబ్బల లాల్ రెడ్డి, కసరబోయిన సత్తయ్య, కల్వల నర్సయ్య, మారుపాక అంజయ్య, మారుపాక యాదయ్య, ఎలిమినేటి దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతిని సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు వీర మల్ల యాదయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి పందుల యాదగిరి, సర్పంచ్ ముత్యాల అంజయ్య, పబ్బు మారయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/రామన్నపేట :** ప్రజా ఉద్యమాల కోసం జీవితమంతా పోరాడిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా రామన్నపేట మండల కేంద్రంలో సుభాష్ సెంటర్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు.సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ మాట్లాడుతూ ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే నిజమైన నివాళులు అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రచ్చయాదగిరి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, సీనియర్ కామ్రేడ్స్ బాలగోని మల్లయ్య, ఊట్కూరి భగవంతం, వీరమల్ల వెంకటయ్య, గంగాపురం యాదయ్య, వెంకటయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి నిత్యం పేద ప్రజల సమస్యల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి అన్నారు.సురవరం ప్రథమ వర్ధంతిని చౌటుప్పల్ పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మునిసిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్‌రెడ్డి, సహాయకార్యదర్శి ఉడుత రామలింగం,నాయకులు కొందూరి వెంకటేష్ ,టంగుటూరు రాములు,రొండి నర్సింహ్మ,బద్దుల సుధాకర్,నీళ్ళ బిక్షపతి,ఎస్‌ఎ రహమాన్,దాసరి కృష్ణ,ఉబ్బు దర్శన్,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



## క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార వస్తువుల పంపిణీ

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ అసోసియేషన్ మరియు బద్దం లింగారెడ్డి సౌజన్యంతో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార వస్తువులతో ఉన్న కిట్లను శనివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చౌటుప్పల్ మునిసిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడుతున్న వారు తప్పకుండా డాక్టర్ల సలహా మేరకు ఆహారం తీసుకోవాలని అన్నారు.టిబి వ్యాధిగ్రస్తులకు చేయూతనివ్వడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రస్ట్ చైర్మన్ దాచపల్లి ప్రకాష్‌గుప్తా,ప్రోగ్రాం ఆర్గనైజర్ వంశీ,జోన్ చైర్మన్ ఉప్పు ఆంజనేయులు,కార్యదర్శి మొగుదాల రమేష్,కోశాధికారి గోశిక కర్ణాకర్,క్లబ్ అధ్యక్షులు ఎండి.అత్తార్‌పాషా,డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరావు,డాక్టర్ అవ్వారు శ్రీనివాసప్రసాద్,సుమన్ కళ్యాణ్,కాటంరాజు,నాంపల్లి రమేష్,సిలివేరు మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంజయ్య స్మృతిలో.. జ్ఞానజ్యోతి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు,న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడు,ఈదులూరు గ్రామానికి 45 ఏళ్లపాటు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా సేవలందించిన బూరుగు అంజయ్య స్మారకంగా ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి సాగర్, మాజీ సర్పంచ్ పున్నా ఆగయ్య, ప్రస్తుత సర్పంచ్ విప్పలపల్లి అనిత ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంజయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని ప్రజల పక్షాన పోరాడారని,ఉమ్మడి నల్లగొండ జిల్లాలో న్యూడెమోక్రసీ ఉద్యమ నిర్మాణంలో కీలకంగా పనిచేశారని తెలిపారు.

## ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారికి ఎమ్మెల్యే అద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కంటి పరీక్షలు,చికిత్సలు అందించడంతో పాటు ఆపరేషన్లు చేయించి కంటి అద్దాలు కూడా అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర రావు, చామల శ్రీనివాస్, పన్నాల రాఘవరెడ్డి,లింగాల వెంకన్న,శ్రీనివాస్,గాజుల సుకన్య పాల్గొన్నారు.

